ఆగిపోయిన అభివృద్ధి కోసం కేంద్రాన్ని కలుస్తాం

- త్వరలోనే కార్పొరేటర్లతో ఢిల్లీకి వెళ్తాం
- చిట్‌చాట్‌లో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 4: కరీంనగర్‌లో నిలిచిపోయిన పనులకు వెంటనే నిధులు మంజూరు చేసి, అభివృద్ధి కొనసాగించే విధంగా చూడాలని త్వరలోనే కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని ఫిల్టర్‌బెడ్‌లో రూ.147 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభోత్సవం చేసిన అనంతరం విలేకరులతో ముచ్చటించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోగానే నగరంలో అప్పటి వరకు సాగిన పనులు ఒక్కసారిగా ఆగిపోయాయని తెలిపారు. అనేక రోడ్లు, మురికికాల్వల పనులను మధ్యలోనే వదిలివేయడంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీఎం అష్యూరెన్స్ కింద చేపట్టిన పనులకు నిధులు మంజూరు చేయాలని, ఇప్పటికే 60 శాతం మేరకు పూర్తయిన మానేరు రివర్ ఫ్రంట్ పనులకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అనేక మార్లు అడిగినా చలనం లేకుండా పోయిందన్నారు. అసెంబ్లీలోనూ నిధుల మంజూరీపై ప్రశ్నించినా సమాధానం లేకుండా పోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ నెలఖారులోగా మానేరు రివర్ ఫ్రంట్ పనులు టూరిజంలోకి తీసుకొని నిధులు మంజూరు చేయాలని, అభివృద్ధి పనులు కొనసాగించాలని నగరంలోని అన్ని పార్టీల కార్పొరేటర్లను కలుపుకొని కేంద్ర టూరిజం శాఖ మంత్రి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, స్థానిక హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలుసుకుంటామని తెలిపారు. నగరానికి నిధులు తీసుకురావాలని ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. అప్పటికీ నిధులు రాకపోతే ప్రజల ముందుకు పోతామని పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, నవంబర్ 4 : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో శివ శివాని కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం చాకుంట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో, వెదురుగట్ట గ్రామంలో డీసీఎంఎస్ ద్వారా కొత్తగా అనుమతులు పొంది రైతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పట్టణాధ్యక్షుడు నిజానపురం చందు, నాయకులు మునిగాల సుధాకర్, పురం రాజేశం, మునిగాల చందు, మావురం రాములు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

రామడుగు, నవంబర్ 4: వెలిచాల శివారులోని కావేరి జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పత్తిని విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, వైస్ చైర్మన్ పిండి సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకుడు నాగరాజు

కార్పొరేషన్, నవంబర్ 4 : మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడిన విషయంలో బీజేపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని బీఆర్ఎస్‌వీ నాయకుడు జక్కుల నాగరాజు హితవుపలికారు. సోమవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వినోద్ కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధి కోసం నేషనల్ హైవేలను ప్రతిపాదించారని, దానిలో దుద్దెడ, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ, చందుర్తి, కోరుట్ల, వరకు నేషనల్ హైవే కావాలని అనేక సందర్భాల్లో కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసి రూ.1100 కోట్లతో మంజూరు చేయించారని తెలిపారు. ప్రస్తుతం ఈ నేషనల్ హైవే సిరిసిల్ల వరకే మంజూరు చేశారని, దానిని సీఎం రేవంత్‌రెడ్డి కోరుట్ల వరకు పొడిగించాలని ప్రతిపాదన చేశారని, దీనిని మంజూరు చేయించేలా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని సూచనలు చేశారన్నారు. ఇది కూడా తెలియని బీజేపీ నాయకులు వినోద్‌కుమార్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ నాయకులు సాయి కృష్ణ, అశోక్, మహేశ్, రమేశ్, నరేశ్, స్వామి కళ్యాణ్, సందీప్ పాల్గొన్నారు.

జ్యోతిష్మతి విద్యార్థికి రూ.19 లక్షల ప్యాకేజీ

జయంత్

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 4 : మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విద్యార్థికి ఏడాదికి రూ.19 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం లభించింది. ఎల్ఎండీ కాలనీకి చెందిన నేదునూరి జయంత్ జ్యోతిష్మతిలో 2023 సంవత్సరంలో ఈసీఈ నుంచి ఉత్తీర్ణత పొంది హైదరాబాద్‌లోని కాడెన్స్ డిజైన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో డిజైన్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాడని జిట్స్ చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి చైర్మన్‌తో పాటు సెక్రటరీ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ పీ కే వైశాలి అభినందనలు తెలిపారు.

బాలుడి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్ట్

రాంనగర్, నవంబర్ 4: బాలుడి కిడ్నాప్ కేసులో కరీంనగర్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన శేఖ రెహానా గత నెలలో భర్తతో గొడవపడి తన రెండున్నరేళ్ల కొడుకుతో కలిసి కరీంనగర్‌లోని తన స్నేహితురాలైన దాసరి స్వరూప ఇంటికి వచ్చింది. అయితే, స్వరూప కొంతకాలం నమ్మకంగానే ఉంచుకుని, ఆమెకు పరిచయం ఉన్న యువకుడితో కలిసి రెహానా కొడుకుని తీసుకొని పరారైంది. రెండు రోజులైనా స్వరూప ఇంటికి రాకపోవడం, ఆమె వద్ద తన కొడుకు ఉండడంతో ఆందోళనపడి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 27న జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితుల కోసం గాలించారు. స్వరూప ఆమె స్నేహితుడు మోతె కృష్ణ హైదరాబాద్ వెళ్లి బాలుడిని అమ్మేందుకు ప్రయత్నించారు. అప్పటికే కేసు నమోదైన విషయం తెలియడంతో తిరిగి వెళ్తే పోలీసులు పట్టుకుంటారని సాధనవేణి లత, రమేశ్ దంపతులకు రూ.50 వేలకు విక్రయించారు. వారం రోజులైనా బాలుడి ఆచూకీ దొరకకపోవడంతో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజన్న, ఐడీ పార్టీ సిబ్బంది బషీర్ కుమార్ ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. ఈ క్రమంలో స్వరూపను అదుపులోకి తీసుకున్న పోలీసులు బాలుడిని కొనుగోలు చేసిన సాధనవేణి లత–రమేశ్ దంపతులను అదుపులోకి తీసుకున్నారు. కృష్ణ పరారీలో ఉన్నాడు. పట్టుబడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. బాలుడిని బాలల సంరక్షణ కేంద్రం అధికారులకు అప్పగించారు.

ప్రయాణం.. నరకప్రాయం



హుజూరాబాద్ టౌన్: ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్టాండ్ ప్రాంగణం

హుజూరాబాద్ టౌన్/ శంకరపట్నం, నవంబర్ 4: రద్దీకి సరిపడా ఆర్టీసీ బస్సులు లేక సోమవారం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం సుమారు గంటన్నర పాటు కరీంనగర్ వైపు, వరంగల్ వైపు బస్సులు రాకపోవడంతో హుజూరాబాద్ బస్టాండ్‌లో నిరీక్షించిన ప్రయాణికులు, చేసేదేమీ లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఇక ఉదయం 7–9 గంటల మధ్య దాదాపు 500 మంది ప్రయాణికులతో కేశవపట్నం బస్టాండ్ కిక్కిరిసిపోయింది. దీపావళి పండుగ, వీకెండ్ కావడం కలిసి రావడం, మహిళలకు ఉచిత ప్రయాణం వెరసి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కాగా, ప్రయాణికుల్లో నూటికి 80 శాతం మహిళలే కావడం గమనార్హం.

ప్రజా‘వాణి’ వినరూ..

- వచ్చిన దరఖాస్తులే మళ్లీ మళ్లీ
- సమస్యలు పరిష్కరించాలంటూ ప్రతి వారం విజ్ఞప్తులు

దుర్శేడుకు చెందిన దివ్యాంగుడు వెంకటేశం సమస్య పరిష్కరించాలంటూ డీడబ్ల్యూవోను ఆదేశిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, నవంబర్ 4: తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజావాణిలో చేస్తున్న విజ్ఞప్తులను కిందిస్థాయి అధికారులు వినడం లేదంటూ పలువురు అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి ప్రతివారం నిర్వహిస్తున్నా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం తొలగడం లేదని వాపోతున్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో 184 దరఖాస్తులు రాగా, వీటిలో సగానికి పైగా గతంలో వచ్చిన విజ్ఞప్తులే ఉండడం గమనార్హం. కాగా, ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు సంబంధించిన అర్జీలపై నిర్లక్ష్యం వహించొద్దని, ప్రాధాన్యత మేరకు సత్వర పరిష్కారం దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవో కె.మహేశ్వర్, మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, తదితరులు దరఖాస్తులు స్వీకరించారు.

కన్న కొడుకే కాదుపొమ్మంటున్నడు

నేను కన్న కొడుకే నువు తల్లివి కాదంటూ నన్ను దూరం కొడుతున్నడు. నాపేరు మీద ఉన్న జాయిజాతంతా తన పేర మార్చుకున్నడు. మూడేళ్ల నుంచి నన్ను ఇంట్లకు రానిత్తలేడు. ఊర్లె పెద్దమనుషుల దగ్గరికి పోయిన. కొడుకును పిలిపించి పంచాయితీ పెట్టిన. పెద్దమనుషులు బుద్ధిమాట చెప్పిండ్లు, అయినా పట్టించుకుంటలేడు. నాభూమి నాకు చేయించాలని మానకొండూర్ తాసిల్దార్ దగ్గరికెళ్లి ఏడ్సిన. నాలుగైదుసార్లు ఆ సారును కలిసిన. నాకు న్యాయం జరుగలేదు. కానీ, నాకొడుకు మాత్రం నాపై మరింత పగ పెంచుకున్నడు. ఇక్కడన్నా న్యాయం దొరుకుతుందేమోనని వచ్చిన. కలెక్టరమ్మకు నేను పడుతున్న బాధ చెప్పుకొన్న. నాకు న్యాయం చేయాలే.

-జి.అంతమ్మ, కొండపల్కల (మానకొండూర్)

బ్యాటరీ సైకిల్ ఇప్పించున్రి

పక్షపాతంతో నాకు కుడివైపు శరీరం మొత్తం సహకరించడం లేదు. డాక్టర్లు సదరం సర్టిఫికెటు కూడా ఇచ్చిన్రు. సంక్షేమాధికారి దగ్గరకు పోయిన దరఖాస్తు ఇచ్చిన. నాకు ఇప్పటిదాకా బ్యాట్రీ సైకిల్ ఇయ్యలే. మాది నిరుపేద కుటుంబం. తినడానికి కూడా తిండిలేని స్థితిలో మా కుటుంబం ఉన్నది. నా పనులు నేను చేసుకునే పరిస్థితి కూడా లేదు. పదకొండు నెలల నుంచి ప్రజావాణికి వచ్చి దరఖాస్తు చేసుకుంటున్న. ఇంకెన్నిసార్ల వస్తే నా బాధ తీరుతదో.

-వెంకటేశం, దుర్శేడు (కరీంనగర్ రూరల్)

11న పెన్షనర్ల ఇష్టాగోష్ఠి సమావేశం

- ప్రతి పెన్షన్‌దారుడు విధిగా పాల్గొనాలి
- సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య

మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య

కలెక్టరేట్, నవంబర్ 4 : ఈనెల 11న పెన్షనర్ల ఇష్టాగోష్ఠి సమావేశం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య తెలిపారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు సంఘం దృష్టికి తెచ్చే క్రమంలో ఈ సమావేశం తలపెట్టినట్లు పేర్కొన్నారు. ఇందిరానగర్ కాలనీ సమీపంలో గల జిల్లా కార్యాలయంలో తలపెట్టిన ఈ సమావేశంలో సంఘంలో సభ్యులైన ప్రతి పెన్షన్‌దారుడు విధిగా పాల్గొని, తమ బాధలు అందరితో పంచుకోవాలని సూచించారు. పెన్షనర్లు, ఉద్యోగులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే కేవలం ఒక్కటి మాత్రమే విడుదల చేస్తామని ప్రకటించి, చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. సీపీఎస్‌లో అదనంగా వసూలు చేసిన మొత్తం కూడా చెల్లించడం లేదని, దీనిపై ప్రశ్నిస్తున్న తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉద్యోగ, పెన్షన్‌దారులకు పూర్తి ఉచితంగా వైద్య సదుపాయం కల్పించేలా హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత కొద్దిమాసాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సత్వరమే ఫైనాన్స్ కమిటీలో ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏడాది కాలంగా ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులకు ఇప్పటి వరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. కేవలం పెన్షన్ మాత్రమే చెల్లిస్తుండగా, ఆయా కుటుంబాల్లో నిరుత్సాహం నెలకొందని మండిపడ్డారు. ఏళ్ల తరబడి ప్రజాసేవ చేసి నెలనెలా వచ్చే వేతనంలో నుంచి కొంతమేర ప్రభుత్వం వద్ద పొదుపు చేస్తే, ఆమొత్తాన్ని ఏడాది దాటినా చెల్లించకపోవడం సముచితం కాదన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే మొత్తంతో కుటుంబ అవసరాలు తీర్చుకుందామని ప్రణాళికలు రూపొందించుకున్న పేద, మధ్య తరగతి వారు తమకు చెల్లించాల్సిన మొత్తం కోసం కండ్లలో వత్తులేసుకుని చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం బాధ్యులు నరేందర్, తిరుపతిరెడ్డి, వెంకటేశం, మల్లేశం, రాజయ్య, మణీల పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

కొత్తపల్లి, నవంబర్ 4 : పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) జిల్లాస్థాయి అండర్ –17 బాల బాలికల ఖోఖో ఎంపిక పోటీలను సోమవారం జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై మహేందర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి 380 మంది బాలబాలికలు హాజరయ్యారు. జిల్లాస్థాయి అండర్–17 ఎస్జీఎఫ్ ఖోఖో పోటీల బాలికల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమ, గంగాధర మండలం ద్వితీయ స్థానం సాధించాయి. అలాగే బాలుర విభాగంలో మానకొండూర్ మండలం ప్రథమ, హుజూరాబాద్ మండలం ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల నిర్వహణలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహ్మద్ యూనిపాషా, పోతన శ్రీనివాస్, ఖోఖో పోటీల నిర్వహణలో కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

కొత్తపల్లి, నవంబర్ 4 : ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్–17, 19 విభాగాల్లో పోటీపడ్డ జిల్లాకు చెందిన క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిలో సీహెచ్ విప్లవ్, బి. కార్తీక్, కె. శివసాయి, డి. సోని, వెండి పతకాలు సాధించిన వారిలో ఎస్. అరుణ్, కె. అక్షిత, కాంస్య పతకాలు సాధించిన వారిలో కె. జశ్వంత్, డి. అంజనప్రియ, ఎస్. శ్రీజ, ఎండీ రఫీక్, ఎండీ అయాన్, కె. లక్ష్మీ సందీప్, పి. శ్రీరాం యాదవ్, బి. మౌనిక, బి. దీపిక, బి. పూజ, కె. స్నితిక, బి. ప్రవళిక ఉన్నారు. వీరిని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, ఎస్జీఎఫ్ కార్యదర్శులు వేణుగోపాల్, మధుజాన్సన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉషూ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపు శంశాక్‌రెడ్డి తదితరులు అభినందించారు.

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయాలి

చిగురుమామిడి, నవంబర్ 4 : ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని చిగురుమామిడి ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

వీణవంక, నవంబర్ 4: మండలంలోని గంగారం, ఎలుబాక, గొల్లపల్లి, బొంతుపల్లి, ఘన్ముక్ల, రెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, నర్సింగాపూర్, బేతిగల్, వల్భాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి స్థానిక నాయకులు, డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాడ వనమాల–సాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గాజుల మేరీ, మాజీ సర్పంచులు పుల్లూరి కుమార్, పొదిల జ్యోతి–రమేశ్, లక్ష్మి–మహేందర్‌రెడ్డి, సునీత–మల్లారెడ్డి, పోతుల నర్సయ్య మోరె సారయ్య, డైరెక్టర్లు సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిరుమల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ పెద్ది మల్లారెడ్డి, సీఐటీయూ హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి రవియాదవ్, సీఈవో ప్రకాశ్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జమ్మికుంట, నవంబర్ 4: పట్టణంలోని ప్రభుత్వరంగ సంస్థ పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. ఇక్కడ మార్కెట్, పీఏసీఎస్ కార్యదర్శులు ఆర్ మల్లేశం, రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు, పీఏసీఎస్, మార్కెట్ అధికారులు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

కరీంనగర్ రూరల్, నవంబర్ 4: ఎలబోతారం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాని మహిళా స్వశక్తి సంఘం వీవో సంధ్య ప్రారంభించారు. వీఏవో సత్య, సీసీ కనకయ్య, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్, నవంబర్ 4: మండలంలోని కొండపల్కల, గంగిపల్లి, చెంజర్ల, ఖాదరగూడెం, అన్నారం, సదాశివపల్లి, లింగాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నల్ల గోవింద రెడ్డి ప్రారంభించారు. సంఘం ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, పాలక వర్గ సభ్యులు, సీఈవో పాకాల లక్ష్మా రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షిస్తాం

రామడుగు, నవంబర్ 4 : బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి పేర్కొన్నారు. రామడుగు మండలం వెదిర కస్తూర్బా బాలికల విద్యాలయంతో పాటు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలంటే, వారికి చేయూతనందించాలన్నారు. బాలల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. అలాగే, సమస్యలు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ధనలక్ష్మి మాట్లాడుతూ, క్షేత్రస్థాయి నుంచే హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు శేఖర్, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి కృపారాణి, సమగ్ర బాలల పరిరక్షణ అధికారి కమలాదేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మనోజ్, కవిత పాల్గొన్నారు.

రిజర్వేషన్లు తొలగిస్తే ఉద్యమిస్తాం

తెలంగాణచౌక్, నవంబర్ 4: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తొలగించాలని కొంత మంది స్వార్థపరులు కుట్రలు చేస్తున్నారని, వారి ఒత్తిళ్లకు లొంగి ప్రభుత్వం రిజర్వేషన్లు తొలగించే ప్రయత్నం చేస్తే ఉద్యమం తప్పదని ఓసీ సంఘాల ఐకాస జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీల రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ట్రాక్టర్ బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు చోరీ

గన్నేరువరం, నవంబర్ 4: గునుకుల కొండాపూర్‌లో ఆరు ట్రాక్టర్ల బ్యాటరీలు, 15 ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలు చోరీకి గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారుల 15 ట్రాక్టర్లను గ్రామంలో వారి నివాసాలకు దగ్గరలో నిలిపి ఉంచగా, ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ధాన్యం మిల్లుకు తరలించేందుకు సన్నద్ధమైన వ్యాపారులు, ఈ విషయాన్ని గుర్తించారు.

జిల్లా జట్టు క్రీడాకారుల ప్రతిభ

కొత్తపల్లి, నవంబర్ 4 : ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్‌లో ఈనెల 2 నుంచి 4 వరకు జరిగిన 38వ రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ 2024 చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి రన్నరప్‌గా నిలిచినట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఫైనల్ పోరులో వరంగల్‌తో తలపడిన ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు రన్నరప్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. వీరిని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు శ్యామల పవన్‌కుమార్, డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విద్యార్థుల సత్తా

కొత్తపల్లి, నవంబర్ 4 : ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 జూడో పోటీల్లో స్థానిక జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన విద్యార్థులు ఎన్ శ్రీహర్ష, ఎస్ సుజల్ ప్రీతం ప్రతిభ చూపి వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వి. కుమారస్వామి, హెచ్ఎం ఆర్ ధనలక్ష్మి, పీఈటీ గోలి నరేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 4 : నగరంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్ కీర్తన, సీహెచ్ రూప రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు డి. సతీశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి యాదాద్రి భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

మాల మహానాడు కమిటీ ఎన్నిక

కొత్తపల్లి, నవంబర్ 4 : కొత్తపల్లి మండల మాల మహానాడు కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్, ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గుంటపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రపల్కల స్వామి, గౌరవాధ్యక్షుడిగా అంకాల హన్మాండ్లు, ఉపాధ్యక్షులుగా గొర్రె రవీందర్, ఇనుగంటి కరుణాకర్, సంయుక్త కార్యదర్శులుగా పండుగ అనిల్, బొబ్బటి నారాయణ, కోశాధికారులుగా పండుగ సాయి కృష్ణ, సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా కాడే నిఖిల్ ఎన్నికయ్యారు.

6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్, నవంబర్ 4: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల్లో అర్హులైన వారు ఈనెల 6లోగా ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు ఏఈఆర్వో కార్యాలయాల్లో నేరుగా తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 6 అనంతరం ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కళాభారతి పనులు వేగంగా పూర్తి చేయాలి

కార్పొరేషన్, నవంబర్ 4: నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కళాభారతిలో రూ.18 లక్షలతో స్టేజీ, మరుగుదొడ్ల నిర్మాణం, కలరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, సౌండ్ సిస్టం, కుర్చీల ఏర్పాటుతో పాటు ఇతర మరమ్మతు పనులు చేపట్టగా, సోమవారం వాటిని పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, గడువులోగా కళాభారతిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ యాదగిరి, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ

విద్యానగర్/కలెక్టరేట్, నవంబర్ 4 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా సోమవారం డాక్టర్ వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గతంలో వరంగల్ జిల్లాలో డీఎంహెచ్‌వోగా పని చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ సుజాత హైదరాబాద్ వెళ్లనున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణను వైద్యులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వీసీ అభినందన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 4 : జాతీయ సాహస శిబిరం 2024 పదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో విజయవంతంగా ముగించుకొని వచ్చిన 10 మంది శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు, ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాంటిజెంట్ లీడర్ డాక్టర్ పడాల తిరుపతిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ అభినందించారు. జాతీయ సాహస శిబిర శిక్షణ కార్యక్రమాల్లో శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిక్షణ, ప్రతిభా పాటవాలను తెలుసుకొని ప్రశంసించారు. ఇక్కడ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మనోహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ అర్జున్, డాక్టర్ రాజేశం, డాక్టర్ గోలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్టు

చిగురుమామిడి/ ఇల్లందకుంట, నవంబర్ 4: పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని హైదరాబాద్‌లోని సచివాలయానికి బయలుదేరిన మాజీ సర్పంచులను పోలీసులు మార్గమధ్యంలో అరెస్ట్ చేశారు. చిగురుమామిడిలో అరెస్టయిన వారిలో మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జక్కుల రవి, మాజీ సర్పంచులు సన్నిల్ల వెంకటేశం, బెజ్జంకి లక్ష్మణ్, గోలి బాపురెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే ఇల్లందకుంట మండలంలో మాజీ సర్పంచులు కంది దిలీప్‌రెడ్డి, తిప్పరపు మొగిలి, రజితా వాసుదేవరెడ్డి, మల్లయ్య, వెంకటస్వామి, వనమాల వాసు, మానసామహేందర్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

108 వాహనాల్లో టెక్నీషియన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విద్యానగర్, నవంబర్ 4 : జిల్లాలోని వివిధ మండలాల్లో 108 అంబులెన్స్‌లలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్‌గా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బీజడ్‌సీ, ఏఎన్ఎం, జీఎన్ఎం బీఎస్సీ నర్సింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఇంటర్మీడియట్‌లో బైపీసీ తర్వాత ఏదేని మెడికల్ డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 6 నుంచి జిల్లా ప్రధాన దవాఖానలోని 108 కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్‌తో వచ్చి సంప్రదించాలని తెలిపారు.

విజయ సంకల్ప మహా పాదయాత్ర జయప్రదం చేయాలి

మానకొండూర్, నవంబర్ 4: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం కరీంనగర్ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారుడు, రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 27న ఉదయం 11 గంటలకు కరీంనగర్‌లో ప్రారంభమయ్యే మహాపాదయాత్ర, 28న వేములవాడలో ముగుస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరాలని వేములవాడ రాజన్నకు మొక్కులు చెల్లిస్తూ ఈపాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు ఎడ్ల జోగిరెడ్డి, మోతె ఎల్లారెడ్డి, ఐల ప్రసన్న, గడ్డం సంపత్ పాల్గొన్నారు.

సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

జమ్మికుంట, నవంబర్ 4: మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో సీసీ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, 15వ వార్డు కౌన్సిలర్ పాతకాల రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 15వ వార్డులో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల నిధులు మంజూరు చేయగా సోమవారం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

తెలంగాణచౌక్, నవంబర్ 4: పెండింగ్‌లో ఉన్న కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిన తర్వాతనే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, కొత్త రేషన్ కార్డుల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రేషన్ కార్డును ప్రామాణికంగా చూస్తున్నందున వాటిని వెంటనే మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బహిరంగ సభకు తరలిరావాలి

తెలంగాణచౌక్, నవంబర్ 4: మాల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో డిసెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు మాల–మాల ఉపకులాల కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాలల ఐక్యత అభివృద్ధి కమిటీ కో కన్వీనర్ ఆర్ష మల్లేశం పిలుపు నిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది మాల–మాల ఉపకులాలు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు నల్లాల కనకయ్య, లక్ష్మీరాజం, అంజయ్య, రమేశ్, మహేందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్ టౌన్/ గన్నేరువరం/ శంకరపట్నం/ తిమ్మాపూర్ రూరల్/ మానకొండూర్ రూరల్, నవంబర్ 4: ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించాలని, మద్దతు ధరతోపాటు 500రూపాయల బోనస్ ప్రకటించాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు అందించారు. కరీంనగర్ రూరల్ తహసీల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి కృష్ణారెడ్డి హాజరై తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అలాగే, హుజూరాబాద్, గన్నేరువరం, శంకరపట్నం, తిమ్మాపూర్, మానకొండూర్ తహసీల్ కార్యాలయాల్లో బీజేపీ నాయకులు తహసీలార్లకు వినతి పత్రం అందించారు. హుజూరాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో వడ్లకుప్పలను పరిశీలించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎల్ఎండీ గేట్లు ఎత్తివేత

తిమ్మాపూర్, నవంబర్ 4: ఎల్ఎండీ రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో సోమవారం ఉదయం అధికారులు మరోసారి గేట్లు ఓపెన్ చేసి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎల్ఎండీ పైన ఉన్న ఎగువ కాకతీయ కాలువ నుంచి ఇన్ ఫ్లో వస్తుండడంతో.. రెండు గేట్లు అర ఫీటు మేర ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. 24టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌లో ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి మట్టం ఉన్నది. పైనుంచి ఇన్ ఫ్లో తగ్గితే గేట్లు మూసివేసే అవకాశం ఉన్నది.

పారమిత విద్యార్థుల క్షేత్ర పర్యటన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 4 : పారమిత ఉన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థులు సోమవారం సిద్దిపేటలోని కోమటిచెరువు, తీగల వంతెన, ఉద్యాన వనాన్ని సందర్శించారు. ఉద్యాన వనంలో రకరకాల మొక్కలు, చెరువులో నివసించే జీవరాసుల గురించి తెలుసుకున్నారు. ఇంటర్ డిసిప్లినరీ లర్నింగ్‌లో భాగంగా విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు. ఇక్కడ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 4 : కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. అనంతరం పూజలు, అభిషేకాలు, భజనలో పాల్గొన్నారు. రామేశ్వరాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో ఆకాశ దీపం వెలిగించారు. పూజా కార్యక్రమాల్లో దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో వెంకన్న పాల్గొన్నారు.